క్లుప్తంగా

విజయవంతంగా వార్షికోత్సవ పూజలు



విశేష అలంకరణలో వేంకటేశ్వరస్వామి

కపిలేశ్వరపురం: వల్లూరు గ్రామంలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి, అయ్యప్ప స్వామి, షిర్డీ సాయిబాబా వార్ల దేవాలయాల సముదాయం 13వ వార్షికోత్సవం పూజలను సోమవారం విజయవంతంగా నిర్వహించారు. ఆయా ఆలయాల వద్ద వేద పండితుల ఆధ్వర్యంలో స్వామివార్లకు విశ్వక్సేన, పుణ్యాహవచనం, అంకురార్పణ, వాస్తుపూజ, అగ్ని ప్రతిష్ఠ, గరుడ ప్రధాన హోమం ధ్వజారోహణ పూజలు చేశారు.

నిబంధనలు పాటించాలి

కాజులూరు: గ్రామాల్లోనూ తినుబండారాలు విక్రయించే వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటించాలని గొల్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.సౌజన్య అన్నారు. సోమవారం గ్రామంలో ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న చెదురు మదురు వర్షాలకు మండల గ్రామాల్లో వాతావరణ కాలుష్యం ఏర్పడి అంటురోగాలు ప్రబలేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. బయట మార్కెట్లలో ఆహారపదార్థాలు విక్రయించే వ్యాపారులు తయారీలోనూ, అమ్మకాల సమయాల్లోనూ తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆకర్షణగా ఉండేదుకు రంగులు, రసాయనాలు ఉపయోగించడం, బహిరంగంగా మూతలు లేకుండా విక్రయిస్తే ఎఫ్‌ఎస్ఎస్ యాక్టు–2006 ప్రకారం అధికారులు కఠిన చర్యలు తీసుకుంటారన్నారు. పీహెచ్‌సీ సిబ్బంది ఇమ్మంది లక్ష్మీప్రసన్న, నరాల రాజారావు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

కె.గంగవరం: స్థానిక బస్టాండ్ సెంటర్ వద్ద సోమవారం మంత్రి వాసంశెట్టి సుభాష్ పుట్టినరోజు సందర్భంగా జనసైనికులు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని మంత్రి సుభాష్ ప్రారంభించి మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి రక్తం ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం రోటరీ క్లబ్ నిర్వహించిన శిబిరంలో 34 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు చిర్రా రాజ్‌కుమార్, ఎంపీటీసీ తాడాల జానకిరామ్, దేవరపల్లి చక్రి, ముంగి రమేష్‌బాబు, తోట వెంకన్న మాజీ జెడ్పీటీసీ మేడిశెట్టి రవికుమార్, దళిత నాయకులు రవ్వా భూషణం తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



రాంబాబును పరామర్శిస్తున్న వట్టికూటి రాజశేఖర్

కె.గంగవరం: మండలంలోని యర్రపోతవరం గ్రామానికి చెందిన గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ ఉప సర్పంచ్ మేడిశెట్టి రాంబాబు కుమారుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో సోమవారం మాజీ ఎంపీపీ. వైఎస్సార్ సీపీ రాజానగరం పరిశీలకులు వట్టికూటి సూర్యచంద్రరాజశేఖర్ రాంబాబు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి వారిని ఓదార్చారు. పార్టీ తరపున కుటుంబానికి న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటామని కుటుంబానికి ఆయన భరోసా ఇచ్చారు. రఘు, గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

క్రైస్తవుల అభ్యున్నతికి కృషి చేస్తా



ఎమ్మెల్యేను సన్మానించి జ్ఞాపిక అందిస్తున్న చర్చి పాస్టర్లు

మండపేట: క్రైస్తవుల అభ్యున్నతికి ఎల్లవేళలా తాను కృషి చేస్తానని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు హామీ ఇచ్చారు. తాపేశ్వరం జీసస్ క్రైస్ట్ గ్లోరీ చర్చిలో సంఘస్తులు సోమవారం ఆయనను ఘనంగా సత్కరించారు. పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డానియేల్ పాల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ళ మాట్లాడుతూ తన గెలుపు వెనక క్రీస్తు అనుగ్రహం ఉందన్నారు. క్రైస్తవుల కోసం పట్టణంలో నిర్మించిన కమ్యూనిటీ హాలును త్వరలోనే ప్రారంభించి క్రైస్తవ సమాజానికి అందిస్తానన్నారు. అనంతరం వేగుళ్లను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపిక బహూకరించారు.

వెజిట్రబుల్స్..

- దిగిరాని కూరగాయల ధరలు
- జేబు ఖాళీ అయినా.. సంచి నిండదు
- పది రోజుల్లోనే అమాంతంగా పెరుగుదల



రాయవరం: రోజు రోజుకూ మార్కెట్లో కూరగాయల ధరలు విపరీతంగా పెరిగి పోతున్నాయి. సామాన్య, మధ్య తరగతి ప్రజలు కొనలేని పరిస్థితి నెలకొంది. మరోపక్క కూరగాయల ధరలు పెరగడంతో పెట్టుబడి పెరిగిందని, కొనుగోలు తగ్గిందని వ్యాపారులూ ఆవేదన చెందుతున్నారు. రుచికరమైన కూరలు వండలేకపోయినా, కనీసం కొత్తమీర, టమాట, పచ్చి మిర్చితో చట్నీ అయినా చేసుకొని పూట గడుపుకుందామంటే వాటి ధరలు కూడా కొండెక్కాయి.

ధరలు దిగి రావడంలేదు

కూరగాయల ధరలు దిగి రావడం లేదు. ఏం కొనాలో..? ఏం తినాలో..? అర్థం కాక వినియోగదారుల్లో ఆందోళన మొదలైంది. మార్కెట్‌తో పాటు రైతు బజార్‌లోనూ టమాట, మిర్చి, బీన్స్, క్యాప్సికం, ఉల్లి, చిక్కుడు, బెండ, బీర ఇలా ఏరకం కూరగాయలు కొనాలన్నా ధరలు దడ పుట్టిస్తున్నాయి. సాధారణంగా జూన్ అంటే ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతుంది. రైతులు, కూలీలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యే కాలమిది. ఈ సీజన్లో ఎన్నడూ లేని విధంగా టమాటా కిలో రూ.60కి పెరిగింది. నెల క్రితం వరకూ రూ.30 నుంచి రూ.40 లోపు ఉండేది. అంతకు ముందైతే కేవలం రూ.20 కే కిలో టమాటాలు లభ్యమయ్యేవి. ప్రస్తుతం అన్ని కూరగాయల ధరలూ రెట్టింపయ్యాయి.

వేసవి ప్రభావం

వేసవిలో కూరగాయల దిగుబడులు తగ్గిపోవడంతో వాటి ధరలపై కొంత ప్రభావం చూపింది. స్థానిక కూరగాయల మార్కెట్‌కు పల్లెల నుంచి కూరగాయలు వస్తుంటాయి. అధికంగా ఇతర జిల్లాల నుంచి, రాష్ట్రాల నుంచి స్థానిక వ్యాపారులు కూరగాయలను దిగుమతి చేసుకుంటారు. అయితే దిగుబడులు తగ్గడంతో ఆశించిన స్థాయిలో రావాల్సిన సరుకు రవాణా తగ్గింది. ఈ పరిస్థితులు కూరగాయల ధరలు అమాంతం పెరిగేందుకు కారణమైందని వ్యాపారులు చెబుతున్నారు. కొన్ని చోట్ల వర్షాలు ఎక్కువై పంటలు దెబ్బతిన్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో ఉల్లిపాయలు కిలో రేటు రూ.45 పలుకుతుండగా, పచ్చిమిర్చి కిలో రూ.60, వంకాయలు, బీరకాయలు కిలో రూ.60 రేటు పలుకుతున్నాయి. ఇక దొండ, బెండ, క్యారెట్, బీట్‌రూట్ కిలో రూ.40 పలుకుతోంది.

ఆకుకూరలూ ప్రియమే

గడచిన కొద్ది రోజుల క్రితం రూ.10కు రెండు కట్టల చొప్పున ఆకుకూరలు విక్రయించేవారు. ప్రస్తుతం రూ.20కు రెండు లేదా మూడు కట్టలు మాత్రమే ఇస్తున్నారు. కొత్తిమీర కట్ట ధర రూ.20 నుంచి రూ.25 కు చేరుకుంది. రైతుల వద్ద అయితే రూ.15 నుంచి రూ.20 రేటుకే లభిస్తోంది. ధరలు భాగా పెరిగినందున గతంలో వందల కట్టలు విక్రయించే తాము ఇప్పుడు పదుల సంఖ్యలో కూడా అమ్మలేక పోతున్నామని వ్యాపారులు వాపోతున్నారు.

దడ పుట్టిస్తున్న ధరలు



కూరగాయల ధరలు దడ పుట్టిస్తున్నాయి. గతంలో రూ.500 తీసుకెళితే చేతి సంచి నిండా కూరలు వచ్చేవి. ప్రస్తుతం రూ.600 నుంచి రూ.700 వెచ్చించినా వారానికి సరిపడా కూరగాయలు తెచ్చుకోలేని పరిస్థితి. ధరలు అదుపులో ఉన్నపుడు కిలో చొప్పున తీసుకెళ్లే కూరగాయలు. ప్రస్తుతం పావు కిలో చొప్పున నాలుగు రకాల కూరగాయలు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

– పలివెల రవిబాబు, చిరుద్యోగి, కూర్మాపురం, రాయవరం మండలం

ధరలు పెరగడంతో అమ్మకాలు తగ్గాయి



ప్రస్తుతం కాయగూరల ధరలు ఒక్కసారిగా రెట్టింపయ్యాయి. ధరలు పెరగడంతో వ్యాపారాలు కూడా తగ్గాయి. ప్రస్తుతం అమ్మకాలు కూడా అంతంతమాత్రంగానే ఉన్నాయి. నెల రోజుల పాటు ఇదేవిధంగా కూరగాయల ధరలు ఉండే అవకాశముంది.

– పేకేటి వీరబాబు, కూరగాయల వ్యాపారి, రాయవరం

మంత్రి సుభాష్ దాతృత్వం



ఆర్థిక సాయం అందించిన మంత్రి సుభాష్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న శ్రీనివాస్, పద్మ దంపతులు

రామచంద్రపురం రూరల్: పుట్టుక నుంచి అంగవైకల్యంతో బాధపడుతున్న ఇద్దరు చిన్నారులతో నానా కష్టాలు పడుతున్న కుటుంబానికి తన పుట్టిన రోజు పురస్కరించుకుని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం రూ.లక్ష ఆర్థిక సాయం అందించి తన దాతృత్వం చాటుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ద్రాక్షారామ శభాష్ పేటకు చెందిన పెంటపాటి శ్రీనివాస్, పద్మ దంపతులకు పుట్టుకతోనే దివ్యాంగులైన వందన, ఆనంద్‌కుమార్ అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇద్దరూ మరొకరి సాయం లేకుండా కదలలేని స్థితిలో ఉండటంతో ఆ కుటుంబం నానా ఇబ్బందులు పడుతోంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆ కుటుంబం పరిస్థితి చూసి చలించిన మంత్రి సుభాష్ తాను ఎన్నికల్లో గెలిచినా, ఓడినా కూడా ఎన్నికల అనంతరం ఆ కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తానని మాటిచ్చారు. సోమవారం తన పుట్టినరోజు పురస్కరించుకుని ఇచ్చిన మాట ప్రకారం ఆర్థిక సాయం అందించడంతో పాటు తన పుట్టిన రోజు నాడు ఏటా ఆ కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తానని స్థానికులు హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, రాంబాబు దంపతులు, వార్డు సభ్యుడు కాళ్ల కురచ ఏడుకొండలు, టీడీపీ నాయకులు టేకుమూడి సత్యనారాయణ, దొంగల శ్రీధర్, చెల్లే శాస్త్రి, జనసేన నాయకులు కర్రా తాతీలు, ముప్పనపల్లి గణేష్, నున్న అశోక్, ఆళ్ల బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి సుభాష్ పుట్టినరోజు

- ఆటో డ్రైవర్లకు యూనిఫాం పంపిణీ
- పలు సేవా కార్యక్రమాలు నిర్వహణ



ఆటో డ్రైవర్లకు యూనిఫాం అందిస్తున్న కార్మిక శాఖ మంత్రి సుభాష్

రామచంద్రపురం: నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా పలు స్వచ్ఛంద సేవలు, యువకులు పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. తొలుత చింతపల్లి సూరన్ననగర్‌లో మొక్కలు నాటారు. అనంతరం పాతబస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాయవరం మండలం సోమేశ్వరం గ్రామానికి చెందిన ముసలమ్మ తల్లి కేర్ క్లబ్ సభ్యులు సమకూర్చిన యూనిఫారమ్స్‌ను 80 మంది ఆటో డ్రైవర్లకు మంత్రి సుభాష్ చేతుల మీదుగా అందించారు. స్థానిక ఏరియా ఆసుపత్రి ఆవరణలో 2000 మందికి అన్నదానం నిర్వహించారు. అనంతరం మంత్రి సుభాష్ ఏరియా ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఆసుపత్రిలో విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విలువలు, త్యాగానికి ప్రతీక బక్రీద్



రాయవరం మండలం వెదురుపాక మసీదులో బక్రీద్ ప్రత్యేక ప్రార్థన చేస్తున్న ముస్లింలు



అంగర మసీదులో బక్రీద్ ప్రాశస్త్యాన్ని వివరిస్తున్న ఇమామ్ నాజీం అక్తర్



బక్రీద్ సందర్భంగా చేదువాడ మసీదులో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు



మండపేట జామియా మసీదులో ముస్లింలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ఇమామ్ ముర్షిద్ రజ్వీ

రాయవరం: పవిత్ర బక్రీద్ పర్వదినం సందర్భంగా సోమవారం మండలంలోని ముస్లింలు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని పలు మసీదుల్లో ఇమామ్‌లు ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు. సర్వమానవాళికి అల్లా బోధనలు అనుసరణీయమని మస్జిద్–ఎ–ఖయ్యత్ ఇమామ్ ఇమామ్ హఫీజ్ అహమ్మద్ అబూబక్కర్ అన్నారు. బక్రీద్ సందర్భంగా మస్జిద్–ఎ–ఖయ్యత్ నిర్వాహకుడు అహ్మద్‌బాషా ముస్లింలకు దైవ సందేశాన్ని ఇచ్చారు. దైవారాధన విశిష్టతను ప్రచారం చేసేందుకు మహా ప్రవక్త హజ్రత్ ఇబ్రహీం చేసిన నిరుపమాన త్యాగశీలతకు ప్రతీకే బక్రీద్ పర్వదినమని పేర్కొన్నారు. ఎవరూ ఆకలితో అలమటించరాదనే సదుద్దేశంతో అల్లా సమాజానికి సందేశాన్నిచ్చారన్నారు. వెదురుపాకలోని మసీద్–ఇ–ఖయ్యత్‌లో బక్రీద్ ప్రత్యేక నమాజ్ చేశారు. కార్యక్రమంలో షేక్ ఖాజాబాబు, షేక్ వల్లీ, షేక్ మహబూబ్ బాషా, సలీం, సయ్యద్ బాషా తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని లొల్ల, రాయవరం, పసలపూడి, చెల్లూరు గ్రామాల్లో కూడా బక్రీద్ వేడుకలను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు.

త్యాగనిరతికి ప్రతీక

కపిలేశ్వరపురం: ఇబ్రహీం, అతని కుమారుడు ఇస్మాయిల్‌ల త్యాగ నిరతికి ప్రతీకగా బక్రీద్ పండుగ జరుపుకుంటామని, వారి త్యాగం యావత్ మానవాళికి గొప్ప ఉద్బోధగా నిలుస్తుందని ముస్లిం మత పెద్దలు అన్నారు.అంగర మస్‌జిద్–ఎ–ఇబ్రహీమలో సోమవాదం బక్రీద్ ఉత్సవాన్ని నిర్వహించారు. మసీదు ముతవలి అబ్బాస్ హుస్సేన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తొలుత ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మసీదు ఇమామ్ మౌలానా మహ్మద్ నాజీం అక్తర్ బక్రీద్ ప్రాశస్త్యాన్ని వివరించారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. స్వీట్లు పంచి సంతోషాన్ని పంచుకున్నారు. పూర్వీకుల సమాధులను సందర్శించి వారితో గడిపిన రోజులను గుర్తించుకున్నారు.

కాజులూరు మండలంలో..

కాజులూరు: మండంలోని చేదువాడ, కాజులూరుల్లో సోమవారం బక్రీద్ పండగ కార్యక్రమాలను ముస్లిలు ఘనంగా జరుపుకొన్నారు. గ్రామాల్లోని మసీదులను సుందరంగా అలంకరించారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి ముస్లిం సోదరులు మసీదుకు చేరుకుని ప్రత్యేక పార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు ఇళ్లకు వెళ్లి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఇబ్రహీమ్ ప్రవక్త అల్లాపై చూపిన ప్రగాఢ విశ్వాసానికి, త్యాగానికి ప్రతీకగా ఏటా ఈ పండుగ నిర్వహిస్తామని చేదువాడ అంజుమాన్ కమిటీ సభ్యులు ఎం.షాజహాన్ తెలిపారు.

మండపేట పట్టణంలో..

మండపేట: బక్రీద్‌ను పట్టణంలోని ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక కలువ పువ్వు సెంటర్లోని జామియా మసీదులో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లిం చిన్నారులు, పెద్దలు పాల్గొన్నారు. మసీదు ఇమామ్ గులాం మహమ్మద్ ముర్షిద్ రజ్వీ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక రైతు బజార్ వద్ద గల షాదీ ఖానాలోనూ పట్టణంలోని మూడు మస్జిద్‌ల జమాత్ సభ్యులు బక్రీద్ ప్రార్థనలు చేశారు. గాంధీనగర్‌లోని అల్ అమీనా మస్జిద్, సైదిల్ పేటలోని హజరత్ హంజా మస్జిద్, విజయలక్ష్మి నగర్‌లోని అల్ అక్సా మస్జిద్‌లోను జమాత్ సభ్యులు ప్రార్థనలు చేశారు. ముస్లింలు తొలుత మండపేట కరాచీ సెంటర్ నుంచి ఊరేగింపుగా షాదీఖానాకు చేరుకొని అక్కడ బక్రీద్ ప్రార్థనల్లో పాల్గొన్నారు. జామియా మసీదులో ఇమామ్ ముర్షిద్ రజ్వీ బక్రీద్ ప్రాముఖ్యతను వివరించారు. ప్రార్థనల అనంతరం ముస్లింలు తమ పూర్వీకుల సమాధుల వద్దకు వెళ్లి పూలు చల్లి స్వర్గస్థులైన వారిని స్మరించుకున్నారు. చుట్టు పక్కల ప్రాంతాల్లో వుండే ముస్లింలు కూడా మసీదులకు విచ్చేసి ప్రార్థనలు చేశారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్



ద్రాక్షారామ షియా జాఫ్రి మసీదులో ఈద్ ప్రసంగం చేస్తున్న మీర్జా అస్కరి హుస్సేన్

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో బక్రీద్ (ఈద్ ఉల్ జుహా) ప్రత్యేక ప్రార్థనలతో మూడు మసీదుల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. మసీదులకు చేరుకుని మత గురువులను అనుసరించి ఈద్ నమాజ్‌లను చేశారు. హజ్ యాత్రకు వెళ్లిన వారి గురించి దువా(వేడుకోలు) చేశారు. ద్రాక్షారామ షియా జామియా జాఫ్రి మసీదులో మత గురువు మీర్జా అస్కరి హుస్సేన్, మార్కెట్‌లోని జామియా మసీదులో మత గురువు మహ్మద్ తసదుక్ హుస్సేన్, వెలంపాలెంలోని షాబాజియా మసీదులో మత గురువు ఎండీ తసఖ్ రజా లు ఆయా మసీదుల్లో భక్తులకు తండ్రీ, కొడుకులు హజరత్ ఇబ్రహీం, హజరత్ ఇస్మాయిల్ చేసిన త్యాగాన్ని సవివరంగా తెలిపారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్న అనంతరం పూర్వీకుల సమాధుల వద్దకు ఊరేగింపుగా వెళ్లి సమాధుల వద్ద ఫాతీహా ఇచ్చారు. ఉదయం నుంచే తమ ఇళ్ల వద్ద ఖుర్బానీ ఇచ్చి చుట్టుపక్కల వారికి పంచారు. మసీదులలో ఈద్ నమాజ్‌లను చదివించారు.

250 కుటుంబాలకు ఈద్గా తోఫా

బక్రీద్ పండుగ, రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ పుట్టిన రోజులను పురస్కరించుకుని మండలంలోని వెలంపాలెం షాబాజియా జామియా మసీదు ఆవరణలో సుమారు 250 కుటుంబాలకు మంత్రి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం, మసీదు ప్రెసిడెంట్, జనసేన నాయకుడు సయ్యద్ ఫాజిల్, టీడీపీ నాయకుడు దొంగల శ్రీధర్‌ల చేతుల మీదుగా ఈద్గా తోఫా(కిరాణా సరుకులు) పంపిణీ చేశారు. కార్యక్రమంలో మసీదు కమిటీ సెక్రటరీ బాబూలాల్, ఎస్‌కే రబ్బాని, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూమి సేకరించారు.. పట్టాలివ్వలేదు



అడివిపాలం కురసాంపేట రెవెన్యూ విలేజ్‌లో పేదల కోసం సేకరించిన భూమి

యానాం: ఇది 17 ఏళ్ల క్రితం నాటి యానాం ఇళ్ల పట్టాల గాథ.. ఎన్నికల వేళ నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామంటూ హామీలిచ్చారు. ఆనందంగా పేదలంతా దరఖాస్తులు చేసుకున్నారు. వందల మందికి పట్టాలిస్తామంటూ 6.5 ఎకరాల భూమిని సైతం సేకరించారు. ఇక అంతే.. అక్కడి నుంచి అడుగు ముందుకు పడితే ఒట్టు.. ఇన్నేళ్లలో ఎందరో నాయకులు మారారు.. ఇంకెందరో అధికారులు వచ్చి పోయారు. కాని పట్టాలు మాత్రం పంపిణీ చేయలేదు. కనీసం కారణమేంటో చెప్పే దిక్కు కూడా లేదు. ఇళ్ల పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్నవారికి తల పండిపోయిందే తప్ప పట్టా మాత్రం దక్కలేదు. యానాం నియోజకవర్గంలో 60 వేలకు పైగా జనాభా నివసిస్తున్నారు. ఇక్కడ ప్రజాప్రతినిధులకు అందే దరఖాస్తుల్లో ఎక్కువ భాగం నివేశన స్థలాల కోసమే వస్తుంటాయి. ప్రస్తుతం ఇళ్ల పట్టాల కోసం 951 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. అనధికారికంగా చెత్త బుట్టలోకి చేరిపోయిన దరఖాస్తులైతే వేలల్లో ఉంటాయని ప్రభుత్వ కార్యాలయ వర్గాల్లోనే చర్చ సాగుతుంది. యానాం నియోజకవర్గ వైశాల్యం రీత్యా భూమి లభ్యత చాలా తక్కువ. పైగా ప్రభుత్వ భూములు సైతం లేకపోవడంతో నివేశనా స్థలాల పట్టాల పంపిణీ జరగడం లేదు. అందుకే ఎన్నో పేద కుటుంబాలు అద్దె గృహాల్లో నివసిస్తున్నాయి. కొందరైతే ఒకే ఇంటిలో అన్నదమ్ముల కుటుంబాలు సైతం ఉంటూ సర్దుబాటు చేసుకుంటున్నారు. నివేశనాస్థల పట్టాల పంపిణీకి భూమిని సేకరించినప్పటికి దానికి సంబంధించి సేకరించి సుమారు 17 ఏళ్లు గడుస్తున్నా ఈ సమస్యగూర్చి పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

2001లో భూసేకరణకు సమావేశం

పేదలకు నివేశనా స్థలాల పంపిణీకి 2001 నవంబర్ 2న రీజినల్ అడ్మినిస్ట్రేటర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భూసేకరణ కమిటీలో ఛైర్మన్, మెంబర్ సెక్రటరీ హోదాలో ఆర్ఏఓ, సభ్యులుగా పీడబ్ల్యూడీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, జూనియర్ టౌన్‌ప్లానర్, డిప్యూటీ డైరెక్టర్(హెల్త్), మున్సిపల్ కమిషనర్ తదితరుల ఆధ్వర్యంలో కురసాంపేట అడివిపాలం రెవెన్యూ విలేజ్‌లో సుభద్రనగర్‌ను చేర్చి ఉన్న 6.5 ఎకరాల దేవదాయశాఖ భూమి సేకరణకు అధికారులు ఆమోదం తెలిపారు. అనంతరం సదరు భూమి పట్టాలిచ్చేందుకు స్వాధీనం చేసుకున్నారు. అంతేకాదు సదరు భూమికి సంబంధించి ప్రభుత్వం నుంచి దేవదాయశాఖకు రూ.3 కోట్ల పరిహారం అందించారు. అయితే తదుపరి ప్రక్రియ ముందుకు వెళ్లకపోవడంతో పాటు అటు అధికారులు, ఇటు నాయకులు పట్టించుకోకపోవడంతో ఇళ్ల పట్టాల పంపిణీ నిలిచిపోయింది. ఇవ్వడానికి భూమున్నా పేదలకు ఇవ్వకుండా ఇన్నేళ్లు తాత్సారం చేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై సంబంధిత అధికారులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఎవరూ బదులిచ్చేందుకు ముందుకు రాలేదు.

ఎంపీ వైథిలింగానికి వినతి

భూమిని సేకరించి 17 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటివరకూ పట్టాలివ్వలేదంటూ ఎంపీ వైథిలింగంకు విడుతలై చిరుతైగల్ కచ్చి పార్టీ యానాం శాఖ కార్యదర్శి మెల్లం శ్రీనివాసరావు ఇటీవలే వినతిపత్రం అందజేశారు. సేకరించిన భూమిని అలాగే వదిలేయడంతో ఆక్రమణదారులు పాగా వేస్తున్నారని, ఇప్పటికైనా స్థలాన్ని స్వాధీనం చేసుకుని పేదలకు పట్టాలు పంపిణీ చేయాలని కోరారు. ముఖ్యంగా నియోజకవర్గ పరిధిలోని కాలువ గట్టు, రహదారికి ఇరువైపులా నివసిస్తున్న పేదలకు నివేశనా స్థలాలు పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేసిన దాతలు

కె.గంగవరం: మండలంలోని కూళ్ల పంచాయతీ శివారు నరజాడలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ పుట్టినరోజు సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు అంగటి రాజేష్ ఆధ్వర్యంలో విద్యార్థులందరికీ నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్‌తో కూడిన బాక్సులు పంపిణీ చేశారు. రానున్న కాలంలో మంత్రి సుభాష్ పేరున సేవా కార్యక్రమాలు చేపడతామని నిర్వాహకులు తెలిపారు. మేడిశెట్టి కృపాకర్, మేడిశెట్టి శ్రీనివాస్, దొమ్మేటి నారాయణరావు, కడలి శివ గోవిందరాజు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాయవరంలో వైభవంగా శ్రీవారి కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

రాయవరం: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి వార్షిక కల్యాణాన్ని సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. కల్యాణంలో భాగంగా విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠాపన, ధ్వజారోహణ, బలిహరణ తదితర క్రతువులు నిర్వహించారు. అంగర సూర్యనారాయణాచార్యుల పర్యవేక్షణలో ఆలయ అర్చకులు అంగర రామకృష్ణ శోభన్‌బాబు, అంగర లక్ష్మీనారాయణలు కల్యాణం జరిపించారు. ఆలయ మాజీ ఛైర్మన్ పులగం శ్రీనివాసరెడ్డి దంపతులు పీటలపై కూర్చుని కల్యాణ తంతు నిర్వహించారు. కల్యాణ వేడుకకు రాయవరం, పరిసర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

అమలాపురం టౌన్: మహిళల్లో ఎదురయ్యే పలు రుగ్మతలకు యోగా వల్ల పరిష్కార మార్గం లభించడమే కాకుండా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని అమలాపురం స్వామి వివేకానంద యోగాశ్రమ గురువు డాక్టర్ ఆకుల శ్రీనివాస్ అన్నారు. స్థానిక జీవీ మాల్ మహిళా సిబ్బందికి సోమవారం ఉదయం నిర్వహించిన ఉచిత యోగా శిక్షణ తరగతుల ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళలు యోగాతో పాటు సరైన ఆహార నియమాలు పాటిస్తే బీపీ, షుగర్, గుండె జబ్బులు, కీళ్ల నొప్పులు వంటి అన్ని రుగ్మతల నుంచి రక్షణ పొందవచ్చని సూచించారు.

యువతకు క్రీడా కిట్ల పంపిణీ

ముమ్మిడివరం: నగర పంచాయతీ పరిధి 4వ వార్డు ఇన్‌చార్జ్ కాకి మాణిక్యం ఆధ్వర్యంలో బేడ, బుడగ జంగాల యువతకు క్రీడా కిట్లను ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు చేతుల మీదుగా సోమవారం అందజేశారు. కార్యక్రమంలో నగర టీడీపీ అధ్యక్షుడు దొమ్మేటి రమణకుమార్, దాట్ల పృథ్వీరాజ్, ఉప్పు సుబ్బారావు, కల్యాణం మావుళ్లు, కల్యాణం విజయ్, చెన్నూరి మరిడియా, కె.రామారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు రావులమ్మ తీర్థం

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారంలో వేంచేసిన రావులమ్మ అమ్మవారి తీర్థాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించనున్నారు. సుమారు పది రోజుల పాటు అమ్మవారి ఉత్సవాలను వివిధ సామాజిక వర్గాల వారు ఘనంగా సేవలు చేశారు. సోమవారం రాత్రి జరిగిన జాతరలో గరగ నృత్యాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

సమగ్ర శిక్షా సీఆర్‌ఎంటీ జిల్లా అధ్యక్షుడిగా నామాడి

అల్లవరం: సమగ్ర శిక్షా సీఆర్‌ఎంటీ జిల్లా అధ్యక్షుడిగా అల్లవరం మండలానికి చెందిన నామాడి వెంకటరావు ఎన్నికయ్యారు. అమలాపురం బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన సీఆర్ఎంటీ జిల్లా స్థాయి సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శులుగా రవికుమార్(కాట్రేనికోన), అనూష(అమలాపురం) ఉపాధ్యక్షులుగా కేపీ రాములు(రాయవరం), బి.కిషోర్(సఖినేటిపల్లి), కోశాధికారిగా ఎం.అర్జున్(పి.గన్నవరం), కన్వీనర్‌గా ఎ.రాజేంద్ర(ఆత్రేయపురం), కో కన్వీనర్‌గా నీలాంబరం(ఐ.పోలవరం), సంయుక్త కార్యదర్శిగా జి.నాగన్న(అమలాపురం), భరోసా కన్వీనర్లుగా నాగభూషణం, ఎం.చంద్రరావులు ఎన్నికయ్యారు.